ప్రజాశక్తి

గురువారం 4 జులై 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

డయేరియా డేంజర్!

- మాచర్లలో ప్రభుత్వాస్పత్రికి రోజుకు 3-5 కేసులు
- పిడుగురాళ్లలో డయేరియా లక్షణాలతో బాలుడు మృతి
- పదుల సంఖ్యలో బాధితులు ఆస్పత్రి పాలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్, పిడుగురాళ్ల

మాచర్ల పట్టణంలో డయేరియా విజృంభిస్తోంది. వివిధ ఆసుపత్రుల్లో రోజురోజుకి డయేరియా కేసులు పెరుగుతున్నాయి. ప్రభుత్వ వైద్యశాలలో ప్రతిరోజూ 3 నుండి 5 కేసులు నమోదవుతున్నాయి. ఇవి కాక ప్రైవేట్ ఆసుపత్రుల్లో మరి కొంతమంది చికిత్స పొందుతున్నారు. డయేరియా వ్యాప్తికి ప్రధాన కారణం పారిశుధ్య లోపమేనని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ ఉధయబాను ఇటీవల ఒక ప్రకటన విడుదల చేసి జాగ్రత్తలు సూచించారు.



పిడుగురాళ్లలోని ఒ ప్రైవేటు ఆస్పత్రిలో డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న మారుతినగర్‌కు చెందిన బాలుడు

పట్టణంలో పారిశుధ్య లోపం తీవ్రంగా కనిపిస్తోంది. చెత్త వేయటానికి డస్ట్‌బిన్స్ అందుబాటులో లేకపోవటంతో చెత్తను రహదారులపై వేస్తున్నారు. దీనికి తోడు ప్రధాన మురుగు కాల్వల్లో పూడిక తొలగించి చాలా ఏళ్లయినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో వర్షం వచ్చినప్పుడు డ్రెయినేజీ కాల్వలు పొంగి రహదారులపైకి మురుగు పారుతోంది. చెత్త పెరుకుపోయి మురుగు పారుదల ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. దీనికి తోడు పట్టణంలో ఆవులు సంచారం అధికంగా ఉండటం, రహదారులపై వేసిన చెత్త, చెదారంలో ఆహారం కోసం వ్యర్థాలను రహదార్లపై చిందరవందర చేస్తున్నాయి. మున్సిపాలిటీ వారు చెత్త తొలగించినా ఆ స్థలంలో బ్లీచింగ్ చల్లకపోవటం వల్ల దుర్గంధం వెదజల్లుతోంది.

ఈ పరిస్థితులన్నీ

2లో

కౌల్దారుకు కార్డు గగనం

- సిసిఆర్‌సి యాక్ట్‌తో వాస్తవ సాగుదార్ల ఇక్కట్లు
- దరఖాస్తులపై సంతకం చేసేందుకు భూయజమానులు ససేమిరా
- పెట్టుబడి సాయంపైనా కౌలురైతల్లో ఆందోళన



ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వాలు ఏవైనా కౌలు రైతుల దయనీయ పరిస్థితి మారట్లేదు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు ప్రభుత్వాల నుండి తగిన సాయం అందట్లేదు. సబ్సిడీలు, బ్యాంకు రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు ఏవీ దక్కక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా పంట ఆధారంగా కౌలు దారులకు సాయం అందించాలనే డిమాండ్‌పై ప్రభుత్వాలు మిన్నకుంటున్నాయి.

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన వేళ కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు అందించటానికి ప్రభుత్వ యంత్రాంగం గ్రామ సభలు నిర్వహిస్తోంది. కౌల్దార్ల హక్కులను నీరుగారుస్తూ భూయజమాని సంతకం తప్పనిసరి చేస్తూ గత ప్రభుత్వం తెచ్చిన సిసిఆర్‌సి యాక్ట్ ప్రకారమే ఈ ఏడాది నూతన ప్రభుత్వంలోనూ కార్డులు మంజూరు చేయటానికి యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం పలుచోట్ల గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. కాగా సిసిఆర్‌సి యాక్ట్ రద్దుచేసి, భూ యజమానితో సంబంధం లేకుండా పంటపై రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు అందించాలనే వినతులను ఏ ప్రభుత్వమూ పట్టించుకోవట్లేదు.

విభజిత గుంటూరు జిల్లాలో సుమారు 70 వేల మంది కౌలు రైతులు ఉంటారని అంచనా కాగా మొత్తం భూమిలో దాదాపు 60 శాతంపైగా వీరే సాగు చేస్తున్నారు. గతేడాది 37,116 మందికి సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయగా అందులో

2లో

లోపలి పేజీల్లో

నేడు విద్యాసంస్థల బంద్

క్రిమినల్ చట్టాలను నిలిపివేయాలి



సత్తెనపల్లిలో పురుగు మందులను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

9.59 లక్షల పురుగు మందులు, ఎరువులు సీజ్

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్, గుంటూరు

సత్తెనపల్లిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సత్తెనపల్లి ఇన్‌ఛార్జి ఎడిఎ ఎస్.శ్రీధర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. శ్రీరామా ఫెర్టిలైజర్స్‌లో ధ్రువపత్రాలేమీ లేని రూ.8 లక్షల 59 వేల 265 విలువగల 670 లీటర్ల పురుగు మందుల విక్రయాలను నిలుపుదల చేశారు. అదమ కంపెనీ వారి అసిఫేట్ మొత్తం పరిమాణం 240 కిలోలు, జిఎస్‌పి క్రాప్ సైన్స్ ఏసిఫేట్ -150 కిలోలు, స్వాల్, ర్యాలీస్ ఇండియా లిమిటెడ్‌కు సంబంధించిన పెండిమిథలిన్-280 లీటర్ల స్టాక్స్ నుండి నాణ్యతా పరీక్షలు నిమిత్తం నమూనాలు

2లో



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

మాట ప్రకారం మీటర్ల బిగింపు ఆపాలి

- వైసిపి ప్రభుత్వ విధానాన్నే కొనసాగిస్తే ఉద్యమం
- పెట్టుబడి సాయం రూ.20 వేలు సత్వరమే ఇవ్వాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య
- స్కీమ్ వర్కర్లపై వేధింపులు ఆపకుంటే వైసిపికి పట్టిన గతే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికలకు ముందు టిడిపి చెప్పిన మాట ప్రకారం వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్ల బిగింపు ప్రక్రియ నిలిపివేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి హయాంలో ప్రజావ్యతిరేకమైన 252 చట్టాలను పార్లమెంటులో ప్రవేశపెట్టగా వాటికి టిడిపి, వైసిపి రెండూ మద్దతివ్వడం దుర్మార్గమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య విమర్శించారు.

2లో



మామిళ్లపల్లి పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పిహెచ్‌సిల్లో రాత్రివేళల్లోనూ సిబ్బంది ఉండాలి

చేబ్రోలులో పిహెచ్‌సి, మామిళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసిన గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-చేబ్రోలు, పొన్నూరు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అన్ని వైద్య సేవలు సజావుగా అందించాలని వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనరల్ వార్డు, లేబర్‌వార్డు, ల్యాబ్ పరీక్షలు నిర్వహించే గదులు పరిశీలించడంతోపాటు రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. పిహెచ్‌సిలో చేయగలిగిన వైద్యపరీక్షలను రోగులకు బయట చేయించుకునే స్థితి తేవొద్దనానరు. గర్భిణీలకు సంబంధించిన హైరిస్క్ కేసులను ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి సజావుగా కాన్పులు జరిగేటట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మాతృమరణాలు

2లో



ప్రజాదర్బార్‌కు తరలివస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-తాడేపల్లి : మంత్రి నారా లోకేష్ తన నివాసం వద్ద నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు మంగళగిరితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు భారీగా తరలివస్తున్నారు. అర్జీలు స్వీకరిస్తున్న లోకేష్ సమస్యల పరిష్కారానికి హామీనిస్తున్నారు. గుంటూరుకు చెందిన ఆశయ సాధన దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తమకు గతంలో టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన టిడ్కో ఇళ్ల రుణాన్ని రద్దు చేయాలని కోరారు. మంగళగిరికి చెందిన ఎస్‌కె భానుబి, నులకపేటకు చెందిన ఆంజనేయులు, తాడేపల్లికి చెందిన డి.పెద్దిరాజు తమకు వికలాంగ పింఛను మంజూరు చేయాలని కోరారు. విద్యుత్ బిల్లు నెపంతో తమకు వస్తున్న పింఛన్‌ను గత అధికారులు తొలగించారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని మంగళగిరికి చెందిన ఎం.వంశీకృష్ణ విన్నవించారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాలలోని రోడ్ల మరమ్మతులకు సత్వర చర్యలు చేపడతామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు గ్రామానికి చెందిన దోస్త్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బుధవారం తెలిపారు. అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని లోకేష్‌ను ప్రజా దర్బార్లో కలిసి విన్నవించారు. గ్రామంలోని ప్రధాన రహదారితో పాటు స్థానిక కొత్తలాకులు, పాతలాకుల మధ్య తెనాలి-విజయవాడ రహదారికి కూడా మరమ్మతులు నిర్వహించారని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి గ్రామంలోని ప్రధాన రహదారికి సిమెంటు రోడ్డు వేస్తామని, రెండు లాకుల మధ్య రోడ్డుకు సత్వర మరమ్మతులు చేపడతామని హామీనిచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో దోస్త్ అధ్యక్షులు మిక్కిలినేని గాంధీ, సభ్యులు గద్దె శ్రీనివాస్, కొండపనేని రవీంద్ర ఉన్నారు.

ఘనంగా సాల్వేషన్ ఆర్మీ 159వ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి -పొన్నూరు : ప్రపంచ వ్యాప్తంగా 136 దేశాల్లో విద్యా, వైద్య, సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో సాల్వేషన్ ఆర్మీ ఆధ్వర్యంలో పేదరికంలో మగ్గుతున్న కోట్లాది మందికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని పొన్నూరు ఇవాంజలికల్ బూత్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కెప్టెన్ కాగిత కనకరత్నం అన్నారు. స్థానిక ఇబిహెచ్ ఆస్పత్రి ఆవరణలో సాల్వేషన్ ఆర్మీ 159వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన పతకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అతి సామాన్య పేద కుటుంబంలో జన్మించిన జనరల్ విలియం బూత్, క్యాథరిన్ బూత్ దంపతులు 1865లో లండన్‌లో సాల్వేషన్ ఆర్మీ సంస్థను స్థాపించి అన్నార్తులను ఆదుకునేందుకు సూప్.. సోప్.. సాల్వేషన్.. అనే నినాదంతో స్థాపించారని తెలిపారు. పొన్నూరులో 1930లో ఇవాంజిలికల్ బూత్ హాస్పిటల్‌ను ప్రారంభించి ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించి, ఈ ప్రాంత ప్రజలకు వైద్యరంగంలో నిరూపమాన సేవలందిస్తున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ బాధితులకు మహా రక్షణ సైన్యం బాసటగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా జనరల్ విలియం బూత్, క్యాథరిన్ బూత్ దంపతుల చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కెప్టెన్ కె.రాజశ్రీ, నర్సింగ్ కళాశాల ఫైనాన్సు ఆఫీసర్ మేజర్ పి.కోటయ్య, మేజర్ హైమావతి చాప్లిన్, మేజర్ పి.ఈశ్వరమ్మ (మ్యాట్రిన్), నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఇబిహెచ్ ఆస్పత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



చెట్ల సంరక్షణతోనే మానవ మనుగడ



ప్రజాశక్తి-తెనాలిరూరల్ :

మొక్కలు పెంచడం వల్ల వాతావరణంలో వచ్చే పెను మార్పులను అరికట్టవచ్చని, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి మొక్కలు దోహదపడతాయని చెంచుపేట నారాయణ స్కూల్ ఆర్ఐబి పూర్ణిమ అన్నారు. స్థానిక చెంచుపేట నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం విద్యార్థులతో వనమహోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాలల ఎజిఎం కె.వెంకటేశ్వరరావు, పూర్ణిమ తదితరులు చిన్నారులతో మొక్కలు నాటించారు. ఆనతరం పూర్ణిమ మాట్లాడుతూ స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎరిక్ లాంచిన్ చెప్పినట్లు పర్యావరణ పరిరక్షణ ప్రణాళిక రూపొందించుకోకున్నా, వాటిని అమలుపరచకున్నా జీవవైవిధ్యం దెబ్బతింటాయన్నారు. చెట్లు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని, చెట్ల వల్లనే మానవ మనుగడ సాధ్యమని చెప్పారు. 2030 నాటికి 350 మిలియన్ హెక్టార్లలో అడవులను పెంచాల్సిన ఆవశ్యకత ఉందని, ఇదే విషయంపై ప్రపంచ దేశాలు తీర్మానించాయని తెలిపారు. జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, భవిష్యత్తు తరాలకు సుస్థిరమైన భవిష్యత్తును ఇవ్వడానికి పర్యావరణ పరిరక్షణ అత్యంత ఆవశ్యకమన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇంటి వద్ద మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యత విద్యార్థులు తల్లిదండ్రులు తీసుకోవాలని అన్నారు. చదువుతోపాటు సమాజం పట్ల విద్యార్థుల బాధ్యతను నిర్వర్తించేలా నారాయణ విద్యా సంస్థలు కర్క్యులమ్ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి 2024-2025 నూతన కార్యవర్గం తొలిగా శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఘాట్ రోడ్డులో మొక్కలు నాటే సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మేరకు బుధవారం శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట ఘాట్ రోడ్డు మార్గం డివైడర్లో ప్రత్యేకంగా తెప్పించిన పెద్ద కదంబం మొక్కలను నాటారు. ముఖ్యఅతిథిగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, రోటరీ ఇంటర్నేషనల్ 3150 రోటరీ డిస్ట్రిక్ట్ పీడీజీ అన్నె రత్నప్రభాకర్, మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, క్లబ్ ట్రైనర్ ఐ.అనిల్ చక్రవర్తి, కార్యదర్శి అందె మురళీమోహన్, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, సర్వీసు ప్రాజెక్టు డైరెక్టర్ కాపరౌతు సుందరయ్య, పాస్ట్ క్లబ్ ప్రెసిడెంట్ అందె రేవంత, అందె రేవంత్ కుమార్, చనుమోలు గోపాల్ రావు, కెవిఎస్ ప్రకాశరావు, అవ్వారు ఫణి కుమార్, కౌతరపు వేణుగోపాల్, ఉడతా శ్రీనివాసరావు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ఇనస్టలేషన్ కార్యక్రమం ఈ నెల 14న లిటిల్ విలేజ్ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కౌల్దారుకు కార్డు గగనం

(మొదటి పేజీ తరువాయి)

7563 మందికి రూ.54 కోట్ల రుణాలు మాత్రమే మంజూరు చేశారు. కార్డులు పొందిన దాదాపు 30 వేల మందికి రుణాలు దక్కలేదు. ప్రతి ఏటా రుణాలు పొందుతున్న వారి సంఖ్య నామమాత్రంగానే ఉంటోంది. ఈ ఏడాది 46 వేలకుగాపై కౌలురైతులకు కార్డులు ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇచ్చిన కార్డుల్లోనూ అత్యధికం బోగస్ కార్డులనే ఆరోపణలు ఉన్నాయి. భూ యజమాని కుటుంబ సభ్యుల పేరుతో కౌలు గుర్తింపు కార్డులు పొందుతున్నారు. దీంతో వాస్తవ సాగుదారులకు అన్యాయం జరుగుతోంది.

గత ప్రభుత్వ హయాంలో అప్పటి వరకూ ఉన్న భూ అధీకృత రైతుల చట్టం రద్దు చేసి, సిసిఆర్‌సి యాక్ట్ తెచ్చారు. ఈ యాక్ట్‌లో కార్డు పొందాలంటే భూ యజమాని సంతకం తప్పనిసరి చేస్తూ నిబంధన విధించారు. దీంతో అప్పటి దాకా కొద్దోగొప్పో గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు కార్డులు దక్కేవి. కానీ సిసిఆర్‌సి యాక్ట్ వల్ల భూ యజమానులు సంతకం చేయటానికి ససేమిరా అంటున్నారు. యజమానులను అంగీకరింప చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందంటూ జిఒలో పేర్కొన్నా ఎక్కడా అటువంటి ప్రయత్నం జరగట్లేదు. సర్వే నంబర్, యజమాని సంతకంతో కూడిన దరఖాస్తు ఉంటేనే కార్డులు ఇస్తున్నారు. దీంతో కౌలురైతులు కార్డులు పొందటం గగనమవుతోంది.

ఈ ఏడాది నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో సిసిఆర్‌సి యార్డు రద్దు చేసి, పాత చట్టాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్ ఉన్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదు. దీంతో కౌలు దారులకు గుర్తింపు కార్డులు అందని ద్రాక్షగానే మారాయి. మరోవైపు నూతన ప్రభుత్వం కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తానన్నది. కానీ లోపభూయిష్టమైన సిసిఆర్‌సి యాక్ట్ ప్రకారం అర్హులను గుర్తిస్తే నిజమైన సాగుదారులకు న్యాయం జరిగే పరిస్థితి లేదని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. కావున ఇప్పుడున్న చట్టాన్ని మార్పు చేసి లేదా రద్దు చేసి అర్హులను గుర్తించి, కార్డులు, రుణాలు, ఇతర ప్రభుత్వ సాయం అందించాలని కోరుతున్నారు.

డయేరియా డేంజర్!

(మొదటి పేజీ తరువాయి)

దోమల ఉధృతికి కారణమవుతోంది. ఎక్కువగా తిను బండరాలు విక్రయించే వారు మురుగు కాల్వల పక్కనే వ్యాపారం చేస్తుండడంతో తినుబండరాలపై ఈగలు, దోమలు వాలి రోగాల కు కారణమవుతున్నాయి. తాగునీటి పైపులైన్లు పైతం డ్రెయినేజీ కాల్వల గుండానే వెళు తున్నాయి. పైపులకు లీకేజీలు ఉండటంతో తాగునీరు కలుషితమవుతోంది. ఈ పరిస్థితులన్నింటినీ చక్కబెట్టకుంటే డయేరియా మరింతగా ప్రబలుతుందని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.

పిడుగురాళ్లలో బాలుడు మృతి

పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్ నగర్‌లో డయేరియా లక్షణాలతో సిద్ధిక్ (9) అనే బాలుడు మృతి చెందాడు. సిద్ధిక్ మంగళవారం సాయంత్రం నుండి వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడ్డాడని, ఉదయం మృతి చెందాడని కుటుంబీకులు చెబుతున్నారు. ముందు రోజు వరకు ఆరోగ్యంగా ఉన్న తమ కుమారుడు హఠాత్తుగా డయేరియా లక్షణాలతో మృతి చెందాడని కన్నీరు మున్నీరవుతున్నారు. ఇది తెలిసిన అధికారులు లెనిన్ నగర్ ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలుడు డయేరియాతో చనిపోలేదని స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు చెప్పినట్లు మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ ప్రకటించారు. మరోవైపు ఆ ప్రాంతంలో బుధవారం ఉదయం నుండి సుమారు 10 మందికి పైగా చిన్నారులు, పెద్దలు డయేరియా లక్షణాలతో లెనిన్ నగర్, మారుతి నగర్ నుండి ఇదే తరహాలో వాంతులు, విరేచనాలతో పట్టణంలోని పలు ఆస్పత్రులలో చేరినట్లు స్థానికులు తెలిపారు. స్థానికంగా ఉన్న ఆర్ఎంపి వైద్యులు, పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు మాత్రం వస్తున్న రోగులు డయేరియాతోనే వస్తున్నారని అంటున్నారు. ఇందుకు తాగునీటి కలుషితమే కారణమని స్థానికులు చెబుతున్నారు.

9.59 లక్షల పురుగు మందులు, ఎరువులు సీజ్

(మొదటి పేజీ తరువాయి)

సేకరించారు. ఇదిలా ఉండగా గుంటూరు పట్నంబజారులోని పురుగు మందులు, విత్తనాలు, ఎరువుల షాపులను సహాయ వ్యవసాయ సంచాలకులు బుధవారం తనిఖీ చేశారు. డీలర్ల స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, విత్తనాలు, ఎరువులు ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువకు విక్రయించ రాదని స్పష్టం చేశారు. స్టాక్ రిజిస్టర్‌లోని నిల్వలు, భౌతికంగా ఉన్న స్టాకు వివరాలు పరిశీలించారు. షాపులో ఉన్న ప్రతి స్టాకుకి సంబంధించిన ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, ‘0’ ఫారంలు వ్యాలిడిటీతో ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రూ.21,559 విలువైన 26.6 లీటర్ల పురుగు మందు, రూ.85 వేల విలువైన కిలో విత్తనాలకు విక్రయాలు నిలుపుదల చేశారు. తనిఖీలలో గుంటూరు రూరల్ మండల ఏఒ వి.సుబ్రహ్మణ్యం, గుంటూరు అర్బన్ వ్యవసాయాధికారి ఓ.సునీల్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో రాత్రివేళల్లోనూ సిబ్బంది ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని, నీటి కాలుష్యం వల్ల వచ్చే వ్యాధులను, కీటకజనీత వ్యాధులను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. చికిత్స నిమిత్తం వచ్చిన రోగులతో మాట్లాడగా రాత్రివేళ వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవటం ఇబ్బందిగా ఉందని పలువురు కలెక్టర్‌కు తెలిపారు. దీంతో రాత్రిపూట తప్పనిసరిగా నర్స్, హెడ్‌నర్స్ ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో వుండాలని, అవసరమైతే మెడికల్ డాక్టర్‌కు వాకబు చేసి వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

పొన్నూరు మండలం మామిళ్లపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్న పాఠశాలను సందర్శించారు. భోజనాన్ని పరిశీలించడంతోపాటు తిని రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరంగా అందించడంతోపాటు, నిర్దేశించిన మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాల భవనం పైఅంతస్తులో అదనపుగదుల నిర్మాణానికి మంజూరైన నిధులను సరిగా వినియోగించడం లేదని తెలుగు యువత మండల అధ్యక్షులు మొవ్వా వెంకటకృష్ణయ్య చెప్పగా విచారణకు డిఇఒను ఆదేశించారు. డ్రెయినేజీ సమస్యలపై స్థానికులు విన్నవించగా సైడు కాల్వలు పూడికలు తీయించాలని పంచాయతీ సిబ్బందికి చెప్పారు. తొలుత గ్రామంలోకి వచ్చిన కలెక్టర్‌కు ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ విజయలక్ష్మీ, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ అన్నపూర్ణ, వైద్యాధికారులు అబ్రహంలింకన్, శైలజ, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, భూగర్భ జల శాఖ డీడీ వందనం, డిఇఒ శైలజ, మామిళ్లపల్లి సర్పంచ్ జాలాది యానాదిరావు, ఎపిసి విజయలక్ష్మీ, ఐసిడిఎస్ పీడీ ఎం.ఉమాదేవి, డిప్యూటీ డీఈవో శాంతకుమారి, ఎంఇఒలు ఎవిహెచ్ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం బాలయేసు పాల్గొన్నారు.

మాట ప్రకారం మీటర్ల బిగింపు ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగించే ప్రక్రియకు సంబంధించి గత వైసిపి ప్రభుత్వం రూ.6 వేల కోట్లతో మీటర్లు కొనుగోలు చేయగా ఆ మీటర్లను పగలగొట్టాలని చంద్రబాబు, లోకేష్ చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం టిడిపి హయాంలో అనకాపల్లి జిల్లాలో మీటర్ల బిగింపును రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ మీటర్లను పగలగొగుతున్నారని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. సిఎం చంద్రబాబు ఈ విషయంలో తన వైఖరి మార్చుకోకుంటే ఉద్యమం తప్పదన్నారు. రాష్ట్రంలో ఎరువులు, విత్తనాల కొరత తీవ్రంగా ఉందని, పంట కాల్వలకు మరమ్మతులు లేక నీరు విడుదల చేసినా పొలాలకు చేరడం లేదని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద పంట పెట్టుబడి కోసం ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, సత్వరమే అందించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య మాట్లాడుతూ కౌల్దార్లకు సిసిఆర్‌సి కార్డుల జారీకి భూ యజమానులు సహకరించడం లేదని, ఈ నేపథ్యంలో 2011 భూ అధికృత చట్టాన్ని పునరుద్ధరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్కీం వర్కర్లను వేధిస్తున్నారని, ఇదేతీరు కొనసాగితే వైసిపికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. స్కీమ్ వర్కర్లు, ఇతర రంగాల కార్మికుల హక్కుల కోసం సిపిఎం పోరాడుతుందని స్పష్టం చేశారు. స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడారు. ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, కె.హనుమంతరెడ్డి, డి.శివకుమారి, జి.మల్లేశ్వరి, టి.పెద్దిరాజు, మహేష్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం



ప్రజాశక్తి-నాదెండ్ల

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలం లోని సాతులూరు గ్రామం పొనుగుపాడు కాలువ కట్ట వద్ద బుధవారం చోటుచేసుకుంది. నాదెండ్ల ఎస్ఐ బలరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఫిరంగి పురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన దేవరపల్లి చం ద్రశేఖర్ (48) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తూ ఉండేవాడు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. రెండు నెలల క్రితం తమ కుమార్తె వివాహం జరిగింది. కుమార్తె దగ్గరకు వెళ్లి తన ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా పొనుగుపాడు కాల్వ సమీపంలో గుంటూరు-నరసరావ ్రపేటకు వెళ్లే లారీ చంద్రశేఖర్ వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతని తల పగలడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మేరీమా ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు



ప్రజాశక్తి-కొల్లిపర

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండలం లోని సిరిపురం వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కొల్లిపరకి చెందిన చీమలదిన్నె ఏడుకొండలు ఆర్టీసీ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. మృతుని స్వగ్రామం కొల్లిపర నుండి ఉద్యోగ నిమిత్తం తెనాలి వెళుతుండగా సిరిపురం వద్ద అతని మోటార్ బైకు అదుపుతప్పి ప్రమా దానికి గురైంది. సంఘటనా స్థలంలోనే ఏడుకొండలు మృతి చెందాడు. అతని భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ ఐ పోతురాజు తెలిపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏడుకొండలుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వీడ్కోలు పలికి తిరిగి వస్తూ మృత్యు కుహరానికి

- **అమెరికా వెళుతున్న కూతురు, అల్లుడు, మనవరాలుకు హైదరాబాద్‌లో సెండాఫ్**
- **తిరిగి వస్తుండగా సత్తెనపల్లి మండలం వెన్నాదేవి సమీపంలో ప్రమాదం**

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డాడు. ఈ ఘటన సత్తెనపల్లి మండలం వెన్నాదేవి సమీపంలో బుధ వారం తెల్లవారుజామున జరిగింది. ఈ ప్రమాదంలో సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెంకి చెందిన గొటి ్టముక్కల వెంకట్రామిరెడ్డి (55) మృతి చెందగా, కారు నడుపుతున్న మరో వ్యక్తి తేళ్ళూరి శ్రీనివాసరెడ ్డిగాయపడ్డాడు. అమెరికా వెళుతున్న తన పెద్దకుమార్తె దీప్తి, అల్లుడు మహేశ్వరరెడ్డి, మనవరాలు యువాన్సి కలను హైదరాబాద్ విమానా శ్రయంలో వదిలి పెట్టేందు కని వెంకట్రామిరెడ్డి తన కుటుంబ సభ్యుల కారులో, మరో కారులో వెంకట్రామి రెడ్డి వియ్యంకుడు, అతని భార్య వెళ్లారు. వెంకట్రామిరెడ్డి, అతని బంధువులు వారికి వీడ్కోలు పలికి తిరిగి బయలుదేరారు. రెండో కారులో ఉన్న బంధువులు సత్తెన పల్లిలో ఆగారు. వెంకట్రామిరెడ్డి ఉన్న కారు ఎంత సేప టికి రాకపోవడంతో శ్రీనివాసరెడ్డికి ఫోన్ చేశారు. మార్గ మధ్యం వెన్నాదేవి సమీ పంలో తమ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టినట్టు శ్రీనివాసరెడ్డి వారికి చెప్పారు. దీంతో, వెంకట్రామిరెడ్డి వియ్యంకుడు వాళ్లు తమ కారులో వెన్నాదేవికి తిరిగి వెళ్లారు. తీవ్రంగా గాయపడ్డ వెంకట్రామిరెడ్డిని, స్వల్పగాయాలైన శ్రీనివాసరెడ్డిని సత్తెనపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకట్రామిరెడ్డి మృతి చెందారు. మృతునికి భార్య రాజ్యలక్ష్మి, ముగ్గురు కుమా ర్తెలు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు వెంకట్రామిరెడ్డి

మాజీ సిఎం జగన్ ఇంటి సమీపంలో కారు కలకలం



ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ ఫొటోలో కనిపిస్తున్న కారు గత మూడు రోజుల నుంచి మాజీ సిఎం వైఎస్ జగన్ ఇంటి సమీపంలోని బకింగ్ హోమ్ కెనాల్ రోడ్డుపై నిలిచి ఉంది. తమ కుటుంబం ఆత్మహత్య చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కారుపై స్టిక్కర్ అంటించి ఉంది. రూ.16 కోట్లు తాము మోసపోయామంటూ న్యూస్ పేపర్ కటింగ్ కూడా కారుకు అంటించి ఉంది. ఎవరు ఎవరి వల్ల నష్టపోయారు, ఎందుకు నష్టపోయారు అనేది తెలియాల్సి ఉంది. మాజీ సిఎం జగన్ మంగళవారం బెంగుళూరు నుంచి తాడేపల్లిలోని తన ఇంటికి రావడంతో కారు సంఘటన ఈ ప్రాంతంలో కలకలం సృష్టించింది. దీనిపై తాడేపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సీతానగరంలో కత్తితో దాడి

ప్రజాశక్తి-తాడేపల్లి: సీతానగరంలో బుధవారం భరత్ అనే యువకుడు బుజ్జి అనే యువకుడిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. విచక్షణా రహితంగా దాడి చేయడంతో మెడ, చేతులు తదితర ప్రాంతాల్లో బుజ్జికి గాయాలయ్యాయి. గంజాయి మత్తులోనే ఈ దాడి జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. దాడి నుంచి తప్పించుకున్న బుజ్జి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భరత్ దొంగ బంగారం, దొంగ నోట్లు, దారి దోపిడీ వంటి కేసుల్లో నిందితునిగా ఉన్నాడు. భరత్ అరాచకాల వల్ల తాము ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సి వస్తుందని స్థానిక మహిళలు కూడా వాపోతున్నారు.

వ్యవసాయ మోటార్లకు వినియోగించే కేబుల్ వైర్లు చోరీ

ప్రజాశక్తి-ఈపూరు : వ్యవసాయ బోరు మోటార్లకు వినియోగించే కేబుల్ వైర్లు చోరీకి గురైన ఘటన మండలంలోని అగ్నిగుండాల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన మూలె విజయభాస్కర్ రెడ్డి, మూలె లక్ష్మిరెడ్డి,పుట్టా చిన్న అంజయ్య,పుట్టా రామలింగం,నంబుల గురవయ్య తో పాటు మరికొందరు రైతులు రంగాపురం తండా రోడ్డు మార్గం వెంబడి బోరు మోటార్ల కింద పంటలు సాగు చేస్తారు.సుమారు 50 మోటార్ల కేబుల్ వైర్లను చోరీ చేశారని రైతులు తెలిపారు .కేబుల్ వైర్లలో ఉండే రాగి తీగను లక్ష్యంగా చేసుకొని తరచూ చోరీలకు పాల్పడుతున్నారన్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యే సమయంలో కేబుల్ వైర్లు చోరీ జరగటం ఆందోళన కలిగిస్తుందని వేల రూపాయలు వెచ్చించి కేబుల్ వైర్లు కొనుగోలు చేయాలని రైతులు వాపోతున్నారు.

గత వారం రోజుల క్రితం ఈపూరు,వనికుంట గ్రామలలో 20 మంది రైతులకు చెందిన వ్యవసాయ బోరు మోటార్ల కేబుల్ వైర్లను దుండగులు చోరీ చేశారు.చోరీల నియంత్రణకు పోలీసులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	42,587
మిర్చి ఎగుమతి	41,920
మిర్చి నిల్వ	18,775


మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,500 - 16,800
నెం.5	10,000 - 14,000
273	15,000 - 15,000
341	9,000 - 16,500
సూపర్ 10	15,000 - 15,000
నాన్ ఎసి	
తేజ	7,500 - 19,500
బడిగి	9,000 - 16,000
తాలుకాయలు	9,000 - 14,000
ఎసి	
334	10,000 -16,000
నెం.5	9,500 -16,000
273	11,800 - 12,300
341	8,500 - 17,500
4884	12,800 -16,000
తేజ	8,000 - 19,000
బడిగి	8,500 - 15,500
దేవనూరు డీలక్స్	10,000 - 13,000
తాలుకాయలు	5,500 - 11,500

కనిపించకుండా పోయిన వ్యక్తి మృతదేహమయ్యాడు

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలోని నెహ్రూనగర్ 2వ లైనుకు చెందిన గుండెబోయిన రాము గత మూడు రోజులుగా కని పించటం లేదు. ఈ మేరకు తల్లి దండ్రులు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాము బుగ్గవాగు రిజర్వాయిర్‌లో శవమై తేలాడు. కనిపించకుండా పోయిన రాము బండి బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయిర్ వద్ద ఉండటం, బండిలో సెల్‌ఫోన్, కళ్ళజోడు పెట్టి ఉండటం చూసి అనుమానించిన స్థానికులు పోలీసులకు సమా చారం అందించారు. వెతుకులాటలో బుధవారం మృతదేహం లభ్యమైంది. రాము మోటారు సైకిల్ మెకానిక్‌గా పని చేస్తు న్నారు. ఈ మధ్యలో ప్రేమ వ్యవహారంలో వివాదం నెలకొన్నట్లు స్థానికులు చెపు తున్నారు. రాము మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయటంతో సిఐ బ్రహ్మయ్య అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టమ్ రిపోర్ట్ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



గుండేబోయిన రాము

స్కీమ్ వర్కర్ల జోలికొస్తే పోరాటం తప్పదు

- ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్
- రాజకీయ వేధింపులపై 10న ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసన
- స్కీం వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండి స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు మొదలయ్యాయని ప్రస్తుతం ఆ రాజకీయ వేధింపులు అధికమయ్యాయని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి విమర్శించారు. కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లీశ్వరి మాట్లాడుతూ గతంలో ఇటువంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు సూపర్వైజర్లు సిడిపివోలు స్పందించి ఆశా కార్యకర్తల పనితీరుపై విచారణ జరిపి మెమోలు ఇచ్చేవారని, తొలగింపులు ఏనాడు జరగలేదని ,ప్రస్తుతం రాజకీయ వేధింపులు తీరు చూస్తుంటే ప్రభుత్వం వేతనాలు ఇస్తున్నట్లు లేదని రాజకీయ నాయకులు వేతనాలు ఇస్తున్నట్లుగా ఉందని విమర్శించారు.

కక్షపూరిత రాజకీయాలకు తావు లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి లోకేష్ చెబుతున్న దానికి క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి అధికార యంత్రాంగాన్ని మంత్రులను ఎమ్మెల్యేలను అప్రమత్తం చేసి కక్షపూరిత రాజకీయ వైఖరి కి స్వస్తి చెప్పాలని సూచించారు. గతంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేసిన పోరాటాల చరిత్ర తెలుసుకుని మసలుకోవాలన్నారు.

డి.శివకుమారి మాట్లాడుతూ నాడు అండగా ఉంటామని నేడు వేధింపులకు పాల్పడుతున్నారన్నారని, తొలగించడం వారి స్థానంలో వేరే వారి నియమించడం అంత సులభమైన పని కాదని రాజకీయ నాయకులు


మాట్లాడుతున్న జి .మల్లేశ్వరి, డి.శివకుమారి

తెలుసుకోవాలన్నారు. కింది స్థాయి నాయకులను అదుపు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం యంత్రాంగంపై ఉందన్నారు. వైసిపి పాలనలో నాలుగున్నర ఏళ్ల తర్వాత పోరాటం చేయాల్సి వచ్చిందని కానీ ప్రస్తుతం నెల రోజుల సమయంలోనే పోరాటాలకు సిద్ధం కావాల్సి వచ్చిందన్నారు. ఆశాలు అంగన్వాడీలు భయపడి రాజీనామాలకు సిద్ధపడొద్దని యూనియన్ అండగా ఉంటుందని యూనియన్‌ను ఆశ్రయించాలని భరోసా ఇచ్చారు. ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్డిఓ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో స్కీమ్ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.


ఎస్వీ రంగారావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న చిత్రం

ఎస్వీ రంగారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నటసార్వభౌముడు కీర్తిశేషులు ఎస్వి రంగారావు 106వ జయంతిని శ్రీనాథ్ సాహితీ పరిషత్,సాహితీ పరిషత్ అధ్యక్షులు స్వర్ణ చిన రామిరెడ్డి రంగారావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని తెలుగు ప్రేక్షకుల్ని తన హావభావాలతో, పాత్రోచిత భాషతో, నటనతో, అంతర్జాతీయ ఖ్యాతి ఎస్వీ సొంతమన్నారు. సినీ,రంగస్థల నటులు దర్శకులు బివి చంద్రశేఖర్ మాట్లాడుతూ రంగారావు నటించిన పలు పాత్రలు రైతు, కూలీ , జమిందారు, జడ్జి , లాయర్ వంటి సాంఘిక పాత్రలు, దుర్యోధనుడు, మయాసురుడు, బాణాసురుడు, హిరణ్యకశిపుడు,రావణాసురుడు, నరకాసురుడు, ఘటోత్కచుడు, దక్షుడు, హరిశ్చంద్రుడు ,భీష్ముడు, భస్మాసురుడు వంటి విలక్షణమైన పౌరాణిక పాత్రల యొక్క ప్రత్యేకతను, బొబ్బిలి రంగారావు, రాజరాజ నరేంద్రుడు, అక్బర్ పాదుషా, భోజరాజు శ్రీనాధుడు వంటి చారిత్రక పాత్ర పోషణలో, మాంత్రికుడు , నేపాల మాంత్రికుడు వంటి జానపద పాత్రలలో తెలుగు బాషా ఔచిత్యాన్ని ప్రస్ఫుటించిన తీరును వివరించారు. గాయకుడు కోటారి రంజిత్ కుమార్ ఎస్వీ నటించిన చిత్రాలలోని గేయాలు ఆలపించారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ మస్తాన్ రెడ్డి, డాక్టర్ పోలేపెద్ది రాధాకష్ణమూర్తి, సీనియర్ ఆడిటర్ షేక్ బాజీ,ఈవూరి వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-సత్తెనపల్లి

విశ్వనట చక్రవర్తి ఎస్వీరంగారావు జయంతి వేడుకలు సత్తెనపల్లిలో జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ కళా క్షేత్రంలో జరిగిన వేడుకలకు విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు కళా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు బుడగాల సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ రావుస్ హాస్పటల్ డాక్టర్ కెవి రావుకృష్ణం శెట్టి, మర్రి వెంకట రామరెడ్డి పాల్గొని మాట్లాడారు. 'నర్తనశాల' లో కీచకుని పాత్రకు గాను ఎస్వీ రంగారావు నాడు జకర్తాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫీల్డ్ ఫెస్టివల్స్ లో ఆ దేశ అధ్యక్షుడు సుకర్నో చేతులు మీదుగా అంతర్జాతీయ ఉత్తమ నటుడు అవార్డును అందుకున్న తొలి దక్షిణ భారతదేశ నటుడు ఆయన అని కొనియాడారు. కార్యక్రమంలో దివ్వెల శ్రీనివాసరావు, నరిసేటి తాండవ కృష్ణ, గంగూరి వెంకట్రావు వల్లెం చెన్నకేశవ, కేదారి రమేష్, రామిశెట్టి రమేష్, తోట ఏడుకొండలు, బి శివ కోటేశ్వరరావు, శిఖా ఆదం, ఆలేటి రవి,సిహెచ్ అంకమ్మ,మాదల వెంకట్రావు, బత్తుల సుధాకర్, కొమ్మిశెట్టి సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థ యాప్ ద్వారా బిల్లులు చెల్లించండి

ప్రజాశక్తి-ఈపూరు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను అనుసరించి ఫోన్ పే, జి పే, పేటియం ఇతర యూపీఐ యాప్స్ నందు విద్యుత్ బిల్లులు చెల్లించుట కుదరదని ఆ యాప్స్ లో డిస్కామ్ పేరు కనిపించదని మండల విద్యుత్ శాఖ అధికారి గాంధీబాబు బుధవారం తెలిపారు. వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ లో ఏపీ సీపీడీసీఎల్ కన్జూమర్ యాప్ డౌన్లోడ్ చేసుకోవడం ద్వారా, సంస్థ వెబ్సైటు https://apcpdcl.in లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చున్నారు.

'కృష్ణవేణి'లో నోట్ పుస్తకాల పంపిణీ

ఆట వస్తువులు కూడా బహూకరించాలని ఎమ్మెల్యే సూచన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పట్టణ సమీపంలోని ఎస్.ఆర్.కె.టి కాలనీ జవహర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కృష్ణవేణి విద్యా సంస్థల సౌజన్యంతో రూ.30 వేల విలువైన నోటు పుస్తకాలను బుధ వారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అర విందబాబు విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వ వసతులతో పాటు దాతలు, తల్లిదండ్రులు సహకారం అవసరమన్నారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్ళుగా ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆట వస్తువులు కూడా బహుకరించాలని కళాశాలల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లుకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రిన్సిపల్ నాతానిని సత్కరించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య ద్వారానే కుటుంబం సమాజం



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని ఈ నేపథ్యంలోనే పేద విద్యార్థులకు తమ వంతుగా ప్రతి ఏడాది ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలో నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు బాగా చదివి విద్యావంతులుగా, డాక్టర్లుగా, రాజకీయ నాయకులుగా ఎదగాలని, ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెద్దల పట్ల ఉపాధ్యాయుల పట్ల, తోటి విద్యార్థుల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలన్నారు.

కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు వి.ఏసుబాబు,ఎం. నాగేశ్వర రావు, టిడిపి నాయకులు పుచ్చకాయల బసవేశ్వర రావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురులింగం, ఉపాధ్యాయులు కె. సుధాకర్,ఎస్.వి సుబ్బారావు,ఎం. అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి వేధింపులు భరించలేకపోతున్నాం

క్రోసూరు పిహెచ్‌సి ఆరోగ్య కార్యకర్తల ఫిర్యాదు

ప్రజాశక్తి-క్రోసూరు

పల్నాడు జిల్లా కోసూరు మండలం క్రోసురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి బాల అంకమ్మ బాయ్‌పై పిహెచ్‌సి లోని ఆరోగ్య కార్యకర్తలు చేసిన ఫిర్యాదులపై బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంక్వైరీ ఆఫీసర్ మురళీకృష్ణ విచారణ చేపట్టారు. అందరి వద్ద నుండి రాతపూర్వకంగా కంప్లైంట్లు తీసుకున్నారు వైద్య అధికారిని తమను బూతు పదాలతో తిడుతున్నారని, మానసిక వ్యాధులకు గురి చేస్తున్నారని ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు జీతాలు



కూడా ఆపుతున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్య అధికారిణి అంకమ్మ బాయ్ మాట్లాడుతూ సిబ్బంది సరిగా పనిచేయని పక్షమున సరిగా వాళ్ల విధులు నిర్వహించాలని వాళ్లకి చెబుతున్నానని అందుకని వాళ్లు నా మీద ఆరోపణ చేస్తున్నారని పేర్కొన్నారు ఈ సందర్భంగా ఎంక్వయిరీ ఆఫీసర్ మురళీకష్ణ మాట్లాడుతూ సిబ్బంది అందరూ రాతపూర్వకంగా ఇచ్చిన సమాచారంను పల్నాడు జిల్లా వైద్యాధికారికి అందజేస్తానని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అధ్యక్షులు షేక్ బాషా సత్తెనపల్లి అధ్యక్ష కార్యదర్శులు పి మణి రావు, అంబేద్కర్, పెన్షనర్ యూనియన్ నిర్మల పాల్గొన్నారు.



ఘనంగా ప్రపంచ ద్విచక్రవాహన మెకానిక్‌ల దినోత్సవం

ప్రజాశక్తి-మాచర్ల

ప్రపంచ ద్విచక్రవాహన మెకానిక్‌ల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ద్విచక్ర వాహన మెకా నిక్‌లందరు బుధవారం మధ్యాహ్నం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు హనీఫ్ మాట్లాడుతూ టూవీల్లర్లు పెరిగినాయని, మోకానిక్‌లు వారి పట్ల ప్రేమతో మెలగాలని సూచించారు. మెకానిక్‌లంటే సమాజంలో చిన్న చూపు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరానికి తగినంత మంది మెకానిక్‌లు కూడ అందుబాటులో లేరని వివరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికోకరు శుభాకాంక్షలు తెలుపు కున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పెద్దబ్బాయి, జావిద్, చెన్నయ్య, ఈశ్వర్‌రెడ్డి, సైదా పాల్గొన్నారు.

ఆవోపా నగదు ప్రోత్సాహకాలకు దరఖాస్తులు

ఆర్యవైశ్య విద్యానిధి అధ్యక్షులు జెవికెఎస్ ప్రసాదు

ప్రజాశక్తి-మాచర్ల

అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు త్వరలో జరగబోయే కార్యక్రమంలో నగదు ప్రోత్సహకాలు అందజేయ నున్నట్లు ఆర్యవైశ్య విద్యానిధి అధ్యక్షులు జెవికెఎస్ ప్రసాదు తెలిపారు. ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మాచర్ల పట్టణంలో చదివిన ఆర్యవైశ్య విద్యార్థులు, 10వ తరగతి, ఇంటర్, ఎంసెట్‌లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు తమ ఫోన్ 9491218777కు వారి మార్క్ లిస్టులు పంపి సంప్రదించాలని కోరారు.

నేడు విద్యాసంస్థల బంద్

జయప్రదం కోసం ఎస్ఎఫ్ఐ పిలుపు
విద్యాసంస్థలకు నోటీసులు


వర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏఎన్‌యు

నీట్ పరీక్ష రద్దు, పిహెచ్‌డి ప్రవేశానికి నెట్ స్కోరింగ్ విధానం రద్దు, ఇతర విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఇతర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం దేశవ్యాప్తంగా జరిగే బంద్‌కు సహకరిం చాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు వర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ సంధ్యాకోల్‌కు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నమిత మాట్లాడుతూ వన్ నేషన్ - వన్ ఎగ్జామ్ ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థను నాశనం చేశారని, రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి తీసుకొని రాష్ట్రాల హక్కులను బలహీన పరుస్తోందని విమర్శించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఏ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని, విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడిందని చెప్పారు. కేంద్రీకృత పరీక్షలు, విద్యను ప్రైవేటీకరించడాన్ని, కోచింగ్ సెంటర్ల సంస్కృతిని పెంపొందిచడాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఇది అత్యంత ప్రమాదకరమని అన్నారు. ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్యా పరిస్థితి కూడా దారుణంగా ఉందన్నారు. బిజెపి పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధించారని, ప్రభుత్వ పాఠశాలలను తగ్గించారని 2018-19, 2021-22 మధ్య దేశంలో మొత్తం పాఠశాల సంఖ్య 15,51,000 నుండి 14,89,115కు తగ్గగా 61,885 పాఠశాలలను మూసేశారని వివరించారు. ఎన్‌టిఎను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, వర్సిటీల్లో విద్యార్థి సంఘ నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలను మానుకోవాలని, విభజన చట్టంలో రాష్ట్రానికి ఇస్తామన్న 11 జాతీయ విద్యాసంస్థలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, అభివృద్ధి చేయలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై చేపట్టిన బంద్‌లో విద్యార్థులంతా పాల్గొనాలని కోరారు. నాయకులు, అజయ్, నాసరయ్య, బాల నాయక్, సిహెచ్.వెంకయ్య పాల్గొన్నారు


పొన్నూరులోని పాఠశాలల్లో వినతిపత్రం ఇస్తున్ననాయకులు

ప్రజాశక్తి-పొన్నూరు

దేశవ్యాప్తంగా నేడు జరిగే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ కోరారు.బుధవారం బంద్ జయప్రదం కోరుతూ పొన్నూరు పట్టణంలో విద్యా సంస్థలకు బంద్ నోటీసులు ఇచ్చారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని, నీట్ పరీక్షలు రద్దుచేసి రాష్ట్రాలే పరీక్షలు నిర్వహించుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 77 రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందించా లని, పరీక్షల్లో లోపాలో నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, దేశవ్యాప్తంగా పాఠశాల మూసివేతను ఆపివేయాలని, నీట్ పరీక్షను రద్దు చేయాలని ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రణ చట్టం చేయాలని తదితర డిమాండ్లతో జరుగుతున్న బంద్‌కు విద్యా సంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.


అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రదర్శనలో టూ వీలర్స్ మెకానిక్ కార్మికులు

టూ వీలర్స్ మెకానిక్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

టూ వీలర్స్ మెకానిక్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రపంచ మెకానిక్ డే సందర్భంగా మంగళగిరిలో టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. మెకానిక్‌లకు సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని స్థానిక అంబేద్కర్ సెంటర్లో నినాదాలు చేశారు. చంద్రన్న బీమా పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో మంగళగిరి సహాయ కార్మిక శాఖ అధికారి మూర్తి, యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ సలీం, మెకానిక్ అసోసియేషన్ నాయకులు టీవీ సుబ్బారావు, జి .ప్రభాకర్‌రావు, బి.వాసు పాల్గొన్నారు.

ప్రయాణికులే ఆర్టీసీకి బలం : ఆర్ఎం

ప్రమాదాలేమీ జరగని డిపోగా మంగళగిరి

ప్రజాశక్తి - మంగళగిరి



వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్టీసీ డ్రైవర్లకు సూచనలు చేస్తూ ఆర్టీసీ రూపొందించిన కరపత్రాలను స్థానిక బస్టాండ్‌లో బుధవారం ఆవిష్కరించారు. బస్టాండ్‌ను ఆర్టీసీ జిల్లా రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ బుధవారం తనిఖీ చేసిన సందర్భంగా వీటిని ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళగిరి ఆర్టీసీ డిపోలో 2023-24 సంవత్సరానికి యాక్సిడెంట్లు లేకుండా జీరో యాక్సిడెంట్‌గా నమోదైందన్నారు. డిపోలోని డ్రైవర్స్, కండక్టర్స్ మెకానిక్ సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. డ్రైవర్లు ఎంతో బాధ్యతాయుతంగా డ్యూటీలు చేయడం వలన ప్రమాదాలు నివారించగలిగామన్నారు. వర్షాకాలంలో వాగులు, వంకలు, పొంగిపొ ర్లుతున్నప్పుడు డ్రైవర్లు తొందరపడి నీటి ప్రవాహంలోకి దించకూడ దన్నారు. డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదగా మాట్లాడాలని, ఎక్కువ మందిని ఎక్కించుకోవడం, చెయ్యెత్తిన చోట బస్సు ఆపటం, వారు కోరిన చోట దించటం వంటివి చేయాలన్నారు. ఆర్టీసీకి ప్రయాణికులే బలమని, ప్రయాణికులు లేనిదే ఆర్టీసీ లేదని అన్నారు. డిపోలో ప్రస్తుతం 31 షెడ్యూల్ తిప్పుతున్నామన్నారు. 22 పల్లె వెలుగులు, ఐదు సూపర్ లగ్జరీలు, రెండు ఆల్ఫా డీలక్స్‌లు, రెండు ఎక్స్‌ప్రెస్‌లు తిరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో డిఎం మంత్రం నాయక్, ఆర్ఎంసిఐ నాగమణి, ఇన్‌ఛార్జి డిజి నాయక్ పాల్గొన్నారు.

2019 చట్టాన్ని రద్దుచేసి 2011 చట్టాన్ని అమలు చేయాలి

కౌల్దార్లందరికీ గుర్తింపు కార్డుల కోసం ఏవోకు కౌలురైతు సంఘం వినతి

ప్రజాశక్తి - దుగ్గిరాల


ఏవోకు వినతిపత్రం ఇస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

వాస్తవ సాగుదార్లయిన కౌలురైతులను గుర్తించి వారందరికీ గుర్తింపు కార్డులు (సిసిఆర్‌సి) ఇవ్వాలని కౌలురైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మండలంలోని చిలువూరు రైతు భరోసా కేంద్రంతో మండల వ్యవసాయాధికారి శిరీషను బుధవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. సంఘం మండల కార్యదర్శి ఎం.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తెచ్చిన 2019 చట్టాన్ని రద్దుచేసి భూఅధీకృత రైతుల చట్టం-2011ను అమలు చేయాలని కోరారు. భూ యజమాని అంగీకారంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే గ్రామసభలు ద్వారా కౌల్దార్లను గురించి వారి నుండి దరఖాస్తులు స్వీకరించాలని, విఆర్‌ఒ, ఏవో, తహశీల్దార్ ద్వారా కార్డులు జారీ చేయాలని విన్నవించారు. సామాజిక తరగతితో సంబంధం లేకుండా కౌలురైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. దేవాదాయ భూమి 10 ఎకరాలను ఐదుగురు వేలంలో దక్కించుకుని ఒక్కొక్కరు రెండెకరాల చొప్పున సాగు చేస్తున్నారని, వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.బాలరాజు, కౌలురైతు సంఘం మండల అధ్యక్షులు బి.అమ్మిరెడ్డి, టి.రామారావు, కె.దావీదు, ఎన్.రాంబాబు, ఎన్.మంగయ్య, కె.మోహన్ రావు, జె.బుజ్జి, జె.పాల్, నరసింహారావు పాల్గొన్నారు.



మంత్రి మనోహర్‌ను కలిసిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి బుధవారం తెనాలిలోని జనసేన కార్యాలయంలో కలిశారు. వైద్య శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించిన మంత్రి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా డిపిఎంయు డాక్టర్ సిహెచ్ రత్న మన్మోహన్, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఇ.అన్నపూర్ణ, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ వి.ప్రియాంక, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ హనీఫ్, డాక్టర్ మౌనిక కుమార్, డాక్టర్ బిబి జాన్, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ మహిత, డాక్టర్ దేవికా వాణి, డాక్టర్ కిషోర్ కుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి సిహెచ్ ప్రభాకరరెడ్డి, ఎ.బాలచంద్రమౌళి, అధికారులు ఎస్.ఉమాకాంత్, వి.పున్నారెడ్డి, జి.రవికుమార్ ఉన్నారు.

కొలకలూరులో ఎస్ ఫోర్ హెల్త్‌కేర్ సొల్యూషన్స్ ప్రారంభం

ప్రజాశక్తి - తెనాలి

వైద్యరంగంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఉపకరణాల తయారీకి శ్రీకారం చుట్టిన ఎస్ ఫోర్ హెల్త్ కేర్ సొల్యూషన్స్ బృందం అభినందనీయులని డి 3 శారద సర్వీస్ సొసైటీ నిర్వాహకులు, ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ డి.శారద అన్నారు. మండలంలోని కొలకలూరులో ఏర్పాటు చేసిన ఎస్ ఫోర్ హెల్త్ కేర్ సొల్యూషన్స్‌ను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఎం.హోలీ ఆహ్వానం పలుకగా సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి అధ్యక్షత వహించారు. డాక్టర్ శారద మాట్లాడుతూ కోవిడ్ సమయంలో రోగులకు చికిత్స చేయడానికి అప్పటి అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా సరైన పరికరాలు అందుబాటులో లేక వైద్యులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో రూరల్ ప్రాంతంలో ఆపరేషన్ థియేటర్లో వైద్యులు ఉపయోగించే సామగ్రి తయారీ యూనిట్ అందుబాటులోకి రావడం విశేషమన్నారు. వ్యవస్థాపకులు మంచికలపూడి సంపెంగరావు మాట్లాడుతూ తన తల్లి కేన్సర్ వ్యాధితో బాధపడి మృతి చెందిన సమయంలో ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు చేసిన కృషి, అదే సమయంలో వైద్యుల స్వీయరక్షణకు అవసరమైన ఉపకరణాల తయారీకి ఆలోచన చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ థియేటర్లో వైద్యులు ఉపయోగించే సర్జికల్ గౌన్స్, మాస్కులు, బఫెట్ క్యాప్స్, బెడ్ షీట్స్, పిల్లో కవర్స్, షూకవర్స్ వంటివి అందుబాటులో ఉన్నాయని, నాణ్యతకు చిహ్నమైన ఐఎస్ఒ గుర్తింపు ఉందని, ప్రతి వస్తువు స్టెరిలైజేషన్తో మార్కెట్కు అందిస్తున్నట్లు వివరించారు. డాక్టర్ ప్రీతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో తయారీ యూనిట్ పలు సవాళ్లతో కూడుకున్న అంశమని, దానిని అధిగమించిన నిర్వాహకులను అభినందించారు. వైద్య రంగంలో హెల్త్ కేర్ ప్రాధాన్యతను డాక్టర్ వల్లూరి రామారావు, డాక్టర్ మంచికలపూడి ఫ్లోరా ఆలీస్ గ్రేస్ వివరించారు. మంచికలపూడి సుబ్బారావు, కె.పవన్ కుమార్, ప్రొప్రైటర్ ఎం.సరోజిని, సంస్థ వ్యవస్థాపకులు ఎం.రవికుమార్, ఎం.సంపెంగరావు, యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.



సంస్థ ప్రారంభోత్సవంలో డాక్టర్ శారద, నిర్వాహకులు

వ్యక్తిత్వ వికాసంపై స్టెప్ ఆధ్వర్యంలో సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక స్తంభాలగరువులోని మున్సిపల్ హైస్కూల్లో బుధవారం యువజన సర్వీసుల శాఖ, స్టెప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా కౌన్సిలర్ ఎస్.అయ్యప్ప వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలు, నాయకత్వ లక్షణాలు గురించి వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి, ఉన్నత స్థాయి ఎదుగుదలకు అవసరమైన సలహాలు చెప్పారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ బి.రాధిక, సూపరింటెండెంట్ సిహెచ్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అయ్యప్ప




చిలకలూరిపేట రైల్వేలైన్ సాధించేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పారిశ్రామికంగా అబివృద్ధి చెందుతున్న చిలకలూరిపేటకు రైల్వే లైన్ ఏర్ప డితే స్పిన్నింగ్, జిన్నింగ్, గ్రానైట్ వ్యా పారాలు అభివృద్ధి చెందుతుందని టిడిపి ప్రముఖ నాయకులు బుధ వారం అన్నారు. ఎం.ఆర్.టి సెంటరోని తన కార్యాలయంలో కలసిన రైల్వే లైన్ సాధన కమిటీ సభ్యులు ఎస్కె సుభానితో మాట్లాడా రు. ఈ లైన్లు ద్వారా ఉద్యోగ అవకా శాలు మెరుగు బడటమే కాకుండా చుట్టుపక్కల గ్రామాలలో కూడా ఉ పాధి ఏర్పడి చిలకలూరిపేట నియో జకవర్గ మొత్తం అభివద్ధి చెందుతుందన్నారు. సుభాని ఆధ్వర్యంలో చిలకలూరిపేట రైల్వే లైన్ సా ధన కోసం చేస్తున్నటు వంటి ప్రతి కార్యక్రమంలో మద్దతు ఇస్తామన్నారు. అలాగే రైల్వే లైన్ కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని టిడిపి నాయకులు రత్నా రెడ్డి తెలిపారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెజ్జం రవి, రైల్వే లైన్ సాధన సమితి సభ్యులు మల్లికార్జున్, నవీన్ తది త రులు పాల్గొన్నారు.

సీట్ల కొరత సృష్టిస్తున్న ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేయండి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను పున రుద్ధరించడం పట్ల ఏపీ గిరిజన సం ఘాల ఐక్యవేదిక నుంచి గిరిజన సం క్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్య రా ణికి ప్రత్యేకమైన కృతజ్ఞతలను బి.శ్రీ ను నాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎన్నార్టీ సెంటర్లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాలలో గత ప్రభుత్వం ఏఎన్ఎం లను విస్మరిస్తే గిరిజన ఐక్యవేదిక ఫలితంగా వారిని నియమించా రన్నారు రాష్ట్రంలో ఉన్న గిరిజన వసతి గృహాల పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉందని, మంత్రి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గిరిజన నామినేట్ పదవుల్లో మైదాన ప్రాంత వాసులకు అవకాశం కల్పించే విధంగా చూడాల న్నారు. గురుకుల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సీట్ల కొరతను సృష్టించి వారికి ఇష్టం వచ్చిన వారికి సీట్లు కేటాయిస్తున్నా రనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా యన్నారు.



అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి

ప్రజాశక్తి-మాచర్ల

ప్రతి ఒక్కరు అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని బిజెపి పట్టణ అధ్యక్షులు ఓర్స్ క్రాంతికుమార్ సూచించారు. పట్టణంలోని నాగ బుద్ధుని శివాలయంలో ప్రధాని మోది పిలుపు మేరకు మొక్కను నాటినట్లు క్రాంతికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమ తుల్యతకు మొక్కలు పెంపకం అవసరమన్నారు. రేపటి తరాల భవిష్యత్ కోసం మొక్కలు నాటే కార్యక్రమం ఒక ఉద్యమంగా కొనసాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యేచూరి సురేష్, మారం వంశీక్రిష్ణ, జమలయ్య, హరిబాబు, దయాకర్, భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి బంద్‌కు విద్యా సంస్థలు సహకరించాలి

ఎస్ఎఫ్ఐ పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నీట్ నెట్ పరీక్ష పేపర్ లీకేజీ ను నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) లెఫ్ట్ సంఘాలను కలుపు కొని గురువారం నాడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా దేశ వ్యాప్త బంద్ కు పిలుపు నిచ్చిన నేప థ్యంలో విద్యాసంస్థలు బంద్‌కు సహకరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోటా సాయికుమార్ అన్నారు. ఎల్.కె.జి నుండి పిజి వరకు గల విద్యా సంస్థలన్నీ బందుకు సహకరించాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కె.సాయి కుమార్ పిలుపునిచ్చారు. దేశ గౌరవ ప్రతిష్టలకు విశిష్టమైన నీట్ పరీక్ష దేశ చరిత్రలో ఏనాడు కనివిని ఎరగని రీతిలో ఈ ఏడాది అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ నీట్ పరీక్ష నిర్వహించే ఎన్.టి.ఏ ను రద్దు చేయాలని బాధిత విద్యార్థులు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందన లేకపోవడంతో దేశ వ్యాప్త బంద్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎన్.టి.ఏ ను పునరుద్ధరించవలసిన అవసరం ఉందని చెప్పినప్పటికి బాధిత విద్యార్థులకు న్యాయం చేస్తామని గాని నీట్ పరీక్షను మళ్లీ నిర్వహిస్తామని గానీ ప్రకటన ఇవ్వకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు. ఈ సందర్భంగా నీట్ పరీక్ష పత్రాల లీకులకు కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేయాలని, పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నూతన విద్యా విధానం పేరిట దేశవ్యాప్తంగా పాఠశాల ల మూసివేత ఆపాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందన్నారు.

అనంతవరం ఎంపియూపి స్కూల్లో తనిఖీ

ప్రజాశక్తి-క్రోసూరు



విద్యార్థులతో కలిసి భోనం చేస్తున్న విద్యాశాఖ అధికారి-2 గణేష్

క్రోసూరు మండలంలోని అనంతవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి-2 గణేష్ బుధవారం సందర్శించారు. పాఠశాలలో విద్యా ప్రవేశ, పాఠ్యపుస్తకాల పంపిణీ, ఎన్రోల్మెంట్ డ్రైవ్ తదితర అంశాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల అధ్యాపకుల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అదేవిధంగా పాఠశాలలోని మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే, విద్యా ర్థులు భోజనం ముందు ప్లేట్లును వేడి నీళ్లతో శుభ్ర పరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డు లను పరిశీలించారు. ముందుగా ఆయన పాఠశాలలో ప్రార్ధన నిర్వహణ, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలిస్తూ, విద్యార్థులతో గణితంలో చతుర్విధ ప్రక్రి యలను చేయించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కోరారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాల ని కోరారు. అదేవిధంగా కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తయారు చేస్తామని అన్నారు. క్రోసూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలల ధీటుగా పని చేస్తున్నాయని ఎంఈఓ గణేష్ అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల సహ కారం తో ఉపాధ్యాయుల సమిష్టి కషి తో ఈ పాఠశాల భౌతిక వసతుల్లో కానీ, గుణాత్మక విద్యలో కానీ ముందుం దని అన్నారు.అదేవిధంగా,క్రోసూరు జిల్లాపరిషత్ పాఠ శాలను మండల విద్యాశాఖ అధికారి-2 గణేష్ పరిశీలించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పుస్తకాలూ, దుస్తులు అందరికి అందాయో లేదో అడిగి తెలుసుకొన్నారు. మధ్యాహ్న భోజనం అమలు తీరుపై ఆరా తీశారు.

'ఐదేళ్లుగా పింఛను సొమ్ము దోచుకున్నారు'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిరుపేద వృద్ధులు, వికలాంగులకు గత ప్రభుత్వం నుంచి తప్పుడు మార్గంలో మంజూరు చేయించుకున్న పింఛను సొమ్మును వైసిపి కార్యకర్తలు దోచుకున్నారని తెలుగు యువత నరసరావుపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. టిడిపి జిల్లా కార్యాలయంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నరస రావుపేట నియోజకవర్గంలో ఎటువంటి అంగవైకల్యం లేని వారు ప్రభుత్వ వైద్యులపై రాజకీయ ఒత్తిడి తెచ్చి సదరన్ సర్టిఫికెట్లు తెచ్చుకొని వికలాంగుల ఫించన్ మంజూరు చేయించు కున్నారని విమర్శించారు.

ఆధార్ కార్డుల్లో వయస్సు మార్పింపించుకుని వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారన్నారు. గడిచిన 5 ఏళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకుని గ్రామాల్లో వైసిపి నాయకులు అధికారులతో కుమ్మక్కై ఒక్కొక్క లబ్ధిదారుని వద్ద రూ 15 వేలు లంచం తీసుకుని పంచు కున్నారని ఆరోపించారు. సచివాలయ ఉద్యోగులు ఆధార్ లో అక్రమాలకు తెర లేపి వైసిపి వర్గీయులకు పెన్షన్ మంజూరు చేయ టంలో కీలకపాత్ర పోషిం చారని కొన్ని గ్రామాలలో భర్త నుంచి విడాకులు పొందకుండానే ఒంటరి మహిళా పింఛన్లు పొందా రన్నారు. వీరు తమ భర్త లతో కలిసి కాపురం చేసు న్నప్పటికీ అధి కారులు విచా రించకుండానే గుడ్డిగా పింఛన్లు మంజూరు చేశారన్నారు.



మాట్లాడుతున్న గంగిరెడ్డి

నరసరావుపేట నియోజకవర్గంలో 10 వేల మందికి పైగా అనర్హులు ఫించన్లు పొందుతున్నారని తెలిపారు. దీనిపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో విచారణ చేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్ట కుండా చూడాలన్నారు.

యర్రబాలెంలో సామాజిక పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-విజయపురిసౌత్

వెల్దుర్తి మండలంలోని యర్రబాలెం గ్రామంలో నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాదెండ్ల బ్రహ్మయ్య, నలబోతుల రవి, రాయంకుల కష్ణ , అలవాల రామారావు, గంధం మల్లయ్య (జనసేన పార్టీ వెల్దుర్తి మండల అధ్యక్షుడు), మిరియాల వెంకటేష్ , మొగిలి శీను , మొగిలి నరేంద్ర పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచి వాలయం సిబ్బంది పాల్గొన్నారు.





మంత్రి గొట్టిపాటితో ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించండి

సచివాలయంలో మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాం క్షించిన అభివృద్ధి,సంక్షేమాలను నియోజకవర్గంలో పక్కాగా అమలు చేయడమే తన ముందున్న తక్షణ కర్తవ్యమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూఖ్,గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యా రాణిని కలిశారు. నియోజకవర్గ అభివద్ధి విషయంలో సహాయ సహకారాలు అందించాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో ఈశ్వర్ కళాశాలల కర స్పాండెంట్ మీరావలి,టిడిపి నాయకులు వేల్పుల సిం హాద్రి యాదవ్,చిన్నప రెడ్డి,బడే బాబు,మస్తాన్ షరీఫ్ తది తరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జూలకంటి బ్రహ్మారెడ్డి భార్య శోభారాణి, పట్లవీడు టిడిపి కార్యకర్తలు

నూతన జెసిబి ప్రారంభం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

అడిగొప్పలలో శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి ఆలయం సన్నిధిలో పట్లవీడు టిడిపి సీనియర్ నేత బత్తుల అంకమ్మరావు, నూతన జేసీబి కి మాచర్ల ఎమ్మెల్యే జూల కంటి బ్రహ్మారెడ్డి, భార్య శోభారాణి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డీ భార్య శోభారాణి, పట్లవీడు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు .

2 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్ సిద్ధం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలో నూతనంగా వోగేరు వాగు మీదుగా నిర్మించిన బ్రిడ్జి వద్ద నుండి షుమారు 2 కిలోమీటర్ల మేరకు వాకింగ్ ట్రాక్ సిద్ధం చేసినట్లు బాపూజీ ట్రస్ట్ అధినేత మురికిపూడి ప్రసాద్ బుధవారం అన్నారు. చెప్పులు విప్పేసి వాకింగ్ చేయవచ్చని, ఎటుమంటి రాళ్ళు, ముళ్ళు లేకుండా మెత్తటి మట్టి, డస్ట్ కాంబినేషన్లో చక్కటి ఆక్సిజన్ లెవెల్స్ ఉన్న ప్రాంతమని,ఉదయం, సాయంత్రం రెండు పూటలా వాకింగ్ చేసు కునే అవకాశం కల్పించా మన్నారు.. విహారి నుంచి రోడ్ల పక్కన ప్రమాదం



ఉంచి ఉన్న ప్రాం తాలలో వాకింగ్ చేసే ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన అవసరం లేకుండా ఈ సౌకర్యాన్ని కల్పించామన్నారు దీనిని వాకర్స్ అందరూ ఉపయో గించుకోవాలని కోరారు.

మెరుగైన ప్యాకేజీ కోసం సిపిఎం విన్నపం

సిఆర్‌డిఎ అధికారులను కలిసిన నాయకులు - జోన్లు ఎత్తేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-తాడేపల్లి

తుళ్లూరులోని సిఆర్‌డిఎ కార్యాలయంలో అధికారులను సిపిఎం నాయకులు జొన్నా శివశంకరరావు, కె.ఈశ్వరరెడ్డి, రైతు పద్మనాభరెడ్డి బుధవారం కలిశారు. సీడ్ యాక్సిస్ రోడ్డుకు సంబంధించి తమకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని అధికారులను కోరారు. 2015లోనే ఉండవల్లికి చెందిన తమ భూముల రిజిస్ట్రేషన్ విలువ ఎకరం రూ.24 లక్షలు ఉన్న సంగతిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం తమకు 2500 గజాలు ఎకరానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో టిడిపి ప్రభుత్వం ఉండవల్లి పొలాలకు సంబంధించి గ్రీన్ జోన్, ఎ1జోన్, వేస్ట్ డంపింగ్ యార్డులకు కొంత భూమిని వదిలిపెట్టిన సంగతిని గుర్తు చేశారు. ఎనిమిదేళ్లు గడిచినా ఆ జోన్‌లు అలాగే ఉన్నాయని, వాటిని ఎత్తివేయాలని కోరారు. ఉండవల్లిలో మిగిలిన భూములకు జిప్లస్ 5 పర్మిషన్ ఇవ్వాలని కోరారు. అధికారులు స్పందిస్తూ పైఅధికారులకు విషయం తెలియజేసి రైతులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షులు మున్నంగి అంజిరెడ్డి, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు వీరారెడ్డి, రైతులు జి.శ్రీనివాసరావు, ఎం.కమలారెడ్డి పాల్గొన్నారు.


అధికారితో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

ఉచిత ఇసుక విధాన ప్రకటనపై హర్షం

ఈ నెల 8వ తేదీ నుంచే ఉచిత ఇసుక విధానాన్ని తీసుకురానున్నట్లు బుధవారం ప్రభుత్వం ప్రకటించడంతో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, పట్టణ రూరల్ కార్యదర్శులు బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక విధానం భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరుకుతాయని పేర్కొన్నారు.



రాజధాని ముఖద్వారానికి విద్యుత్ వెలుగులు

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఉన్న ఉండవల్లి, పెనుమాక గ్రామాలకు సంబంధించి రోడ్లు మొన్నటి అంధకారంలో మునిగిపోయాయి. గత ప్రభుత్వం రాజధాని అమరావతికి ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో కనీసం మెయిన్‌రోడ్డుపై పాడైపోయిన లైట్లు కూడా మరమ్మతులకూ నోచలేదు. దీంతో కొంతమంది స్తంభాలకు ఉన్న విద్యుత్ లైట్లను దొంగిలించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో నిన్నటి దాకా అంధకారంలో ఉన్న పెనుమాక, ఉండవల్లి గ్రామాలకు వెళ్లే మెయిన్ రోడ్డు విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. రెండు రోజుల నుంచి అధికారులు ఈ పనులు చేపట్టి పూర్తి చేశారు. ఈ రోడ్డు మీదే ప్రసిద్ధి చెందిన ఉండవల్లి గుహలున్నాయి. విద్యుత్ వెలుగులతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సజావుగా ఎఎన్‌యు ఐసెట్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సెల్ఫ్ స్టడీ కేటగిరీలో భర్తీ చేయనున్న ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాలకు బుధవారం నిర్వహించిన ఎఎన్‌యు ఐసెట్ పరీక్ష జరిగిందని అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత తెలిపారు. పరీక్ష రాసిన అభ్యర్థులకు ర్యాంకుల కేటాయించి ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించండి : బీసీ సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - మంగళగిరి

బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని, మౌలిక వసతులు కల్పించాలని సిఎం చంద్రబాబుకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్కూల్ స్థాయి నుండి కాలేజీ వరకు విద్యార్థులు మెస్ ఛార్జీలు సరిపోక, ప్రభుత్వం ఇస్తున్న మెస్‌ఛార్జీల మెనుకు సరిపోక చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో పెంచిన ఛార్జీలు సంతృప్తికరంగానే ఉన్నాయని, వైసిపి ప్రభుత్వ హయాంలో పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా లేకపోగా, చాలా నామ మాత్రమే పెంచారని అన్నారు. చాలా హాస్టళ్లను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారని, సొంత భవనాలు నిర్మాణానికి దృష్టి పెడితే, ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గుతుందని చెప్పారు. బీసీ సంక్షేమ అధికారులకు హాస్టల్స్ నిర్వహణ బిల్లులు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, అప్పులు చేసి హాస్టల్స్ నిర్వహిస్తున్నారని, బిల్లులను సత్వరమే విడుదల చేయాలని కోరారు. ప్రతినెలా బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగమల్లేశ్వరరావు, యువజన రాష్ట్ర అధ్యక్షులు కె.క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షులు పి.మహేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీనివాస్, యువజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యు.రాజ్‌కిరణ్, జి.సూర్యప్రకాష్ పాల్గొన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న కేశన శంకరరావు తదితరులు

రంగస్థల నటనపై వర్సిటీలో ఒక్కరోజు శిక్షణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఎస్పీ బాలసుబ్రమణ్యం స్కూల్ ఆఫ్ పర్ఫా మింగ్ ఆర్ట్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ రంగస్థలం నటన వివిధ అంశాలపై ఒకరోజు శిక్షణ శిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరానికి అధ్యాపకులుగా సునయన తమ అనుభవాలను విద్యార్థి కళాకారులతో పంచుకున్నారు. వివిధ శైలి విధానాలు మీద ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించినట్లుగా ప్రొఫెసర్ డాక్టర్ ఎల్వి నాగభూషణరావు తెలిపారు. ఈ శిక్షణ శిబిరం వల్ల మాస్టర్ పర్ఫామెన్స్ విద్యార్థులు ఈవినింగ్ డిప్లొమా ఇన్ యాక్టింగ్ విద్యార్థి కళాకారులకు లబ్ధి చేకూరిందని తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరంలో వర్సిటీలో మాస్టర్ పర్ఫామెన్స్ డిప్లమా ఇన్ యాక్టింగ్ అనే కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల నాటక కళాకారులు, యువకులు తమ నైపుణ్యాల్ని శాస్త్రీయంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ డిప్లమా పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చునని డాక్టర్ భూషణం తెలిపారు.



వార్డుల్లో ఎమ్మెల్యేల పర్యటన

పారిశుధ్యంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం - పలు అంశాలపై ఆదేశాలు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ప్రజాశక్తి-గుంటూరు

పేదల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించే శానిటేషన్ అధికారులను, పేదల ప్రాణాల పట్ల నిర్లక్ష్యం వహించే విద్యుత్ అధికారులను క్షమించబోమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక మూడో వార్డు, బాలాజీ నగర్‌లోని రాజీవ్ గహకల్ప సముదాయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్లాట్ల వెనుక చెత్తాచెదారం పేరుకుపోయి ఉండడాన్ని గమనించి శానిటరీ అధికారులను మందలించారు. విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండటం, విద్యుత్ మీటర్లు సరిగా లేకపోవడం, ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉండటాన్ని గమనించి విద్యుత్ అధికారులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్లాట్ల లబ్ధిదారులు తమస్థల హద్దుల వరకు మాత్రమే క్రమబద్ధీకరించుకోవాలని, దీనివల్ల ఇతర ప్లాట్ల వారికి అసౌకర్యం కలగకుండా ఉంటుందని అన్నారు. రాజీవ్ గృహకల్పలోని ప్లాట్లకు నిరంతరం తాగునీరు సరఫరా చేయాలని, అంతర్గత రహదారులు వేయాలని, పారిశుధ్యాన్ని త్వరగా మెరుగుపరచాలని, సీజనల్ వ్యాధులు సోకకుండా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. పర్యటనలో జిఎంసి అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యానికి తొలి ప్రాధాన్యమిస్తున్నాని, అధికారులు సహకరించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. 18వ డివిజన్‌లో రామనామక్షేత్రం, శ్రీనివాసరావుపేట, వెంగళశెట్టి వారి వీధి, అడపాబజార్, మొహిద్దీన్‌పాలెం, వడ్డెగూడెంలో ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. ద్విచక్ర వాహనం నడుపుతూ, డివిజన్‌లోని ప్రధాన వీధులతో పాటు, సందుల్లోనూ పర్యటించి ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. డివిజన్‌లో ప్రధానంగా డ్రెయినేజి, వీధిదీపాలు, తాగునీటి పైపుల లీకులు, రోడ్లు వంటి ప్రజాసమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. తాగునీటి పైపు లైన్‌లో మురుగు నీరు కలవటం వలన డయేరియా వంటి ప్రాణాంతక రోగాలు ప్రబలిన ఘటనలను గతంలో చూశామని, ఇప్పుడు అటువంటి ఘటనలు జరగకుండా దృష్టి పెట్టాలని అన్నారు. డ్రెయినేజి నీరు రోడ్లమీద పొంగకుండా కాల్వలు తరచూ శుభ్రం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట జిఎంసి అధికారులతోపాటు, టిడిపి నాయకులు వనమా నరేంద్ర, ఉప్పదలసాంబ, సానం రమేష్, మల్లె నరసింహారావు పాల్గొన్నారు.


పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి



సఫాయి కర్మాచారి సభ్యులు వావాను కలిసిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్లు, కౌన్సిళ్లు, కమిషనర్లు, సిఇఒలు ఇతర సంబంధిత అధికారులతో గురువారం సమీక్షా సమావేశం కోసం జాతీయ సఫాయి కర్మాచారి కమిషనర్ సభ్యులు డాక్టర్ పి.పి.వావా గుంటూరుకు బుధవారం వచ్చారు. ఆయన్ను నగర కమిషనర్ కీర్తి చేకూరి స్థానిక వెల్‌కం హోటల్లో మర్యాదపూర్వకంగా కలిశారు.

కలెక్టర్‌కు ఎమ్మెల్సీ లక్ష్మణరావు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు



జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ విస్తరణకు భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారని, భూసేకరణకు రూ.120 కోట్లు నిధుల విడుదలకు కృషి చేయాలని కోరారు. గుంటూరు నగరంలో జ్యోతిరావుపూలే బిసి స్టడీ సర్కిల్‌కు భవన నిర్మాణానికి కృషి చేయాలని, దీనికి అవసరమైన స్థలం కేటాయించాలని కోరారు. తాడికొండ, కాకుమాను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

7న రామోజీరావు సంస్మరణ సభ

ప్రజాశక్తి-గుంటూరు : అక్షర యోధుడు రామోజీరావు సంస్మరణ సభ ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తామని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. జనచైతన్య వేదిక, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం జన చైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు, ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టర్, ప్రవేట్ విద్యాసంస్థల రాష్ట్ర కో-చైర్మన్ మేకల రవీంద్రబాబు, మానవత వ్యవస్థాపక కార్యదర్శి రమణబాబు తదితరలు పాల్గొని సంస్మరణ సభ వివరాలు తెలియజేశారు. సంస్మరణ సభలో ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, కాంగ్రెస్ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రిటైర్డ్ ఐఎఎస్ అధికారులు డాక్టర్ పి.వి.రమేష్, పి.కృష్ణయ్య, బిజెపి రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-తాడేపల్లి : ఎన్నికల వాగ్దానంలో భాగంగా పింఛను పెంచడంతో పాటు ఈ నెల మొదటి తేదీనే పెంచిన పింఛను అందజేసిన సందర్భంగా సిఎం చంద్రబాబు చిత్రపటానికి తాడేపల్లిలో వికలాంగులు పాలాభిషేకం చేశారు. రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పింఛను పెంచారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, కార్యదర్శి దాసు, ఎ.మురళీ, ఇ.భాస్కర్, టి.గోపి, ఎస్‌కె అమీర్, జి.శ్రీనివాస్, శ్రీను, సింహాచలం, కోటేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ దివ్యాంగుల అధ్యక్షులు అజయ్‌కుమార్ పాల్గొన్నారు.




సూక్తిశ్రీని అభినందిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత, హెచ్‌పిసిఎల్ హెచ్‌ఆర్ చీఫ్ మేనేజర్ శ్రీకాంత్

టెన్నిస్‌లో పల్నాడు సూక్తిశ్రీకి కీర్తి

సౌత్ ఇండియా స్థాయి పోటీల్లో పదేళ్ల చిన్నారికి రెండు బహుమతులు - హోం మంత్రి అనిత, ఇతర ప్రముఖుల అభినందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ టెన్నిస్ కోర్టులో సోమ, మంగళవారాల్లో రెండ్రోజులపాటు జరిగిన అండర్-10, అండర్-12 సిట్ సౌత్ ఇండియా టెన్నిస్ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 70 మందికి పైగా పాల్గొనగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు చెందిన పివి సూక్తిశ్రీ అత్యుత్తమ ప్రతిభతో రెండు రన్నరప్ ట్రోఫీలు గెలుచుకున్నట్లు కోచ్ బుక్యా బాబునాయక్ బుధవారం తెలిపారు. ప్రతిభ చాటిన చిన్నారి సూక్తిశ్రీకి విశాఖపట్నంలోని హెచ్‌పిసిఎల్ హెచ్‌ఆర్ చీఫ్ మేనేజర్ బి.శ్రీకాంత్ ట్రోఫీలు బహుకరించగా హోం మంత్రి వంగలపూడి అనిత అభినందించినట్లు చెప్పారు. సూక్తిశ్రీ ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎన్నో టోర్నమెంట్లలో సత్తా చాటినట్లు చెప్పారు. గతంలో అండర్-14 విభాగంలో పదేళ్ల సూక్తిశ్రీ పోటీ పడి సత్తా చాటినట్లు తెలిపారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఆఫీసర్స్ క్లబ్ నందు గల విశాలమైన క్రీడా ప్రాంగణంలో చిన్నారులకు టెన్నిస్‌లో శిక్షణిస్తున్నట్లు బాబు నాయక్ చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారి సూక్తిశ్రీ మాట్లాడుతూ తన విజయంలో కోచ్ బాబు నాయక్, తల్లిదండ్రులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సురేఖ పాత్ర ఎంతో కీలకమన్నారు. తండ్రి ప్రోత్సాహంతో రెండేళ్ల నుండి టెన్నిస్ శిక్షణ తీసుకుంటున్నానన్నారు. సిట్ సౌత్ ఇండియా టెన్నిస్ పోటీల్లో సాధించిన విజయాన్ని కోచ్ బాబునాయక్‌కు అంకితం చేస్తున్నట్లు సూక్తిశ్రీ చెప్పారు. సూక్తిశ్రీ నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్‌లోని సిబిఐటి స్కూల్‌లో 6వ తరగతి చదువుతుండగా చదువుతో పాటు కూచిపూడి, భరతనాట్యంలో శిక్షణ తీసుకుంటున్నారు. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు కార్యక్రమాల్లో నృత్యప్రదర్శన ద్వారా ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు.

క్రిమినల్ చట్టాలను నిలిపివేయాలి

ప్రజాశక్తి - పెదకాకాని

వాహన డ్రైవర్లకు ప్రమాదకరంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాలను రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.శివాజి, ముజఫర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన పెదకాకానిలో ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివాజి, ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ డ్రైవర్లపై శిక్షలు కఠిన తరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో చట్టం తెచ్చిందని అన్నారు. న్యాయ సంహిత జీవో 106(1), 2 సెక్షన్ ప్రకారం ఏదైనా వాహనం ప్రమాదానికి గురైతే డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపినట్లుగాని, ఘటనా స్థలి నుండి పారిపోయినట్లుగాని ఎఫ్‌ఐఆర్‌లో నమోదైతే ఐదేళ్ల జైలు, రూ.10 లక్షల జరిమానా విధించాలని జీవో తెచ్చారని చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చిన గత పదేళ్లలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని, వాహన స్పేర్ పార్ట్స్‌పై జిఎస్‌టి, రోడ్డు టాక్స్, గ్రీన్ టాక్స్, టోల్ టాక్స్ అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు పెంచారని విమర్శించారు. రాష్ట్రంలో గతంలో జీవో 21 ద్వారా అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు పెంచారని చెప్పారు. ఈ జీవోలన్నిం టినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటోలకు పట్టణ, మండల కేంద్రాల్లో పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి డ్రైవర్లని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలోనాయకులు బి.బాబురావు, కె.సత్యనారాయణ, వి.శివయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కె.గోపి, ఎస్.బల్లారెడ్డి, మస్తాన్, పూర్ణ రెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



పెదకాకాని, గుంటూరులో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు



ప్రజాశక్తి-గుంటూరు

భారతీయ న్యాయ సంహిత-2023 అమలు నిలుపుదల చేయాలని, జిఒ 106, జిఒ 21ని రద్దు చేయాలని ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శివాజీ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బిఆర్ స్టేడియం వద్ద ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ఎలాంటి చర్చా లేకుండా భారతీయ న్యాయ సంహిత-2023 ఆమోదించి, 2024 జూలై 1 నుండి అమలు చేసే విధంగా గెజిట్ విడుదల చేసిందన్నారు. దీనిని న్యాయవాద సంఘాలు, బార్ అసోసియేషన్లు, పౌర సమాజం వ్యతిరేకిస్తున్నా నిరంకుశంగా అమలుకు పూనుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దీని ప్రకారం పొరపాటున ప్రమాదం జరిగి ఎవరైనా మరణిస్తే డ్రైవర్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు అయితే ఆ డ్రైవర్‌కు రూ.10 లక్షలకుపైగా జరిమానా, ఐదేళ్ల జైలు శిక్ష విధించే విధంగా కఠినమైన నిర్ణయాలు ఉన్నాయన్నారు. సిఐటియు గుంటూరు నగర తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రవాణా రంగ కార్మికులపై అధిక పెనాల్టీలు, ఫీజులు పెంచుతూ తీసుకొచ్చిన జీవో 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి, ప్రధాన కార్యదర్శి గండికోట శంకర్రావు, స్టాండ్ అధ్యక్షులు ఎస్.కె సమీవుల్లా, ఇబ్రహీం, గోపి, శ్రీనివాసరావు, బాష పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో అల్లూరి జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

తెల్లదొరలను ఎదిరించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామారాజు 127వ జయంతిని స్థానిక అమరావతి రోడ్డులోని సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కాలేజీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అల్లూరి జీవిత చరిత్రను, బ్రిటీషు వారిని ఎదిరించి పోరాడిన తీరును ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ విమల మేరి, కరస్పాండెంట్ సిస్టర్ అమలజోస్ఫిన్ వివరించారు.



అల్లూరి చిత్రపటం వద్ద నివాళుర్పిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యలమంద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాబాల మూఢత్వ ప్రచారం ఆపాలి : జెవివి

ప్రజాశక్తి-గుంటూరు

దేశ వ్యాప్తంగా బాబాలు చేస్తున్న అసత్య ప్రచారం, మూఢనమ్మకాలను ఆపాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బాబాలు ప్రజల్లో మూఢత్వాని, ఆశాస్త్రీయ ధోరణులు ప్రచారం చేస్తున్నారని, దీని వల్ల అమాయక ప్రజలు అనేక రకాలుగా నష్టపోతున్నారని తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లోని హత్రాస్‌లో బోలే బాబా పాద ధూళి కోసం జరిగిన తొక్కిసలాటలో 116 మంది మరణించటం, వందలాది మంది గాయపడటం బాధాకరమని, దీనికి కారణమైన బాబాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూఢనమ్మకాల నిరోధ చట్టం తీసుకురావాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ(హెచ్) ప్రకారం ప్రభుత్వం ప్రజలలో శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందించటానికి చర్యలు తీసుకోవాలని, పాఠ్యాంశాలలో వీటిని పొందుపరచాలని కోరారు.

సామాజిక చైతన్యం నింపిన సూర్యోదయం

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామీణ కుటుంబాలలో మహిళల విద్య ప్రాధాన్యాన్ని చాటి చెప్పే విధంగా గన్నే వాసుదేవరావు స్వీయ కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో తీసిన లఘు చిత్రం సూర్యోదయం సామాజిక చైతన్యం పెంపొందిస్తుందని ఎంపిటిసి ఉప్పుటూరి సుజాత పేర్కొన్నారు. గన్నె వాసు ఆర్ట్స్ సమర్పణలో మహిళా విద్య ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ తీసిన లఘు చిత్రం సూర్యోదయం బుధవారం వింజనంపాడు పోతినేని కోటేశ్వరరావు ఇంటి ఆవరణలో ప్రదర్శించారు. చిత్ర దర్శకులు గన్నే వాసుదేవరావు మాట్లాడుతూ తాను ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్‌గా పదవి విరమణ చేసిన తర్వాత తమ పాఠశాల విద్యార్థులు వివిధ గ్రామాల్లోని ప్రజలతో ఇప్పటికీ 11పైగా సందేశాత్మక లఘు చిత్రాలను నిర్మించి యూట్యూబ్‌లో ఉంచారన్నారు. యూట్యూబ్‌లో గన్నే వాసు ఆర్ట్స్ ద్వారా వీక్షించవచ్చని చెప్పారు. విశ్వసంకీర్తనచార్య తుర్లపాటి శంబయాచార్య శుభాకాంక్షలు తెలియజేశారు. లఘు చిత్ర నిర్మాణంలో కెమెరా యు.అశోక్‌బాబు, ఎడిటింగ్ ఎం.మల్లికార్జునాచారి, నేపథ్య సంగీతం బి.శ్రీలక్ష్మి, సుధారాణి, సాహితి అందించగా కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జి.చంపరయ్య, ఉప్పుటూరి సాంబశివరావు, ఎం.జానకి రామయ్య పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధుపట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ

వర్షాకాలంలో వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్లు, ల్యాబ్‌టెక్నీషియన్లకు నెలవారి సమీక్షా సమావేశం డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే వ్యాధుల పట్ల పంచాయతీలు, మున్సిపాలిటీలతో సమన్వయంగా ఉండి, పరిశుభ్రతను మెరుగుపరుచుకోవాలని, నీటినిల్వలను ఎప్పటికప్పుడు నివారించుకోవాలన్నారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని, ఆసుపత్రికి వచ్చిన రోగులలో కనీసం 15 శాతం మందికి రక్త పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. లేబొరేటరీలో కావాల్సిన రీఏజెంట్లను ఎప్పటికప్పుడు సమకూర్చుకోవాలని, ల్యాబ్ టెక్నీషియన్లు రిజిస్టర్లు, రిపోర్టులు అప్‌డేట్‌గా ఉంచుకోవాలని, సూపర్వైజర్లు కీటక జనిత వ్యాధుల నివారణ చర్యలు చేపట్టి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులైన మలేరియా, డెంగీ కేసులను గణనీయంగా తగ్గించాలని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్లు రాజునాయక్, ప్రభాకర్‌రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్లు దస్తగిరి ఘంటసాల శ్రీనివాసరావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

సాహిత్యరంగంలో అనుభవం ఉన్న వారికే పదవులివ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

కొత్తగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాహిత్యరంగానికి సంబంధించి త్వరలో భర్తీ చేయనున్న నామినేట్ పదవులను ఆయా శాఖల్లో అనుభవం ఉన్నవారినే ఎంపిక చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కోరింది. ఈ మేరకు అధ్యక్షులు డాక్టర్ సి.భవానీదేవి ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీ, అధికార భాషా సంఘం, గ్రంథాలయ పరిషత్ తదితర సాహిత్య రంగానికి చెందిన శాఖల్లో నియమించే రాష్ట్ర ఛైర్మన్‌న్లు, జిల్లా ఛైర్మన్లు, సభ్యులను సాహిత్యేతరులతో కాకుండా ఆయా రంగాల్లో జాతీయస్థాయిలో విశేష అనుభవం ఉన్నవారినే ఎన్నుకోవాలని సూచించారు. కవులు, రచయితలు, కళాకారులకు ఇచ్చే ఉగాది పురస్కారాలు, కళారత్న అవార్డులు ఇవ్వడం కొనసాగించాలని, గత ప్రభుత్వం వీటిని విస్మరించడం వల్ల సాహిత్యరంగంలో నిరుత్సాహం నెలకొందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కవులు, రచయితలు, ప్రచురణకర్తల నుండి జిల్లా గ్రంథాలయ సంస్థలు పుస్తకాలు కొనుగోలు చేశాయని, కానీ రెండున్నరేళు గడిచినా కొన్ని జిల్లా సంస్థల నుండి రూ.లక్షలాది బిల్లులు విడుదల కాలేదని, ఈ ప్రభుత్వం ఈ సొమ్మును వెంటనే విడుదల చెయ్యడంతోపాటు, కొత్త పుస్తకాలు కొనుగోలుపై శ్రద్ధ చూపాలని కోరారు. కవులు, రచయితల పుస్తకాలు ప్రచురించుకునేందుకు గతంలోలాగే భాషా సాంస్కృతిక శాఖా ద్వారా ఆర్థిక సహాయం అందించేలా కృషి చేయాలని, అన్నిరంగాల అభివృద్ధితోపాటు నిస్తేజంతో ఉన్న సాహిత్యరంగ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.